కథా నిలయం
3794
శ్రీకాకుళం

# అలసిన గుండెలు

ఆరో కాన్పుకు అమ్మగారింటికి పోవడానికి సిగ్గయింది శేషమ్మకు. పోయిన సారి పుట్టింటికి పోయినప్పుడు తమ్ముని భార్య ములికివంటి మాట అన్నది : "కనడానికేం—నేనూ కంటాను — సంవత్సరాని కొక పిల్లను. చాకిరీ చేసేవా ళ్లుండొద్దూ !" అని. ఆ మాట విన్నప్పుడు ముసలి తల్లిని పట్టుకొని మూడు రోజులు యేడ్చింది శేషమ్మ. "గొడ్డుమోతుది — దాని మాటల కేం లేమ్మా" అని తల్లి యెంత ఓదార్చినా, ఆనాడే తీర్మానం చేసుకున్నది—యిక పుట్టింటికి పోకూడదని. యిప్పుడు మళ్లీ అమ్మగారింటికి పోతే బాగుండుననే ఆలోచన తనకు తెలియకుండానే రావడంతో, ఆమెకు సిగ్గుతోబాటు కోపంకూడా వచ్చింది. "ఆ రాకాసిదాని కొంపకు చచ్చినా పోను. అంతగా అయితే మా అమ్మను యిక్కడికే రమ్మంటాను" అనుకుంది.

సీతారామయ్య యింటికి రాగానే, శేషమ్మ వంట యింట్లో నుండి నేరుగా వచ్చి "యేమండీ, యీ సారి నేను మా వూరికి పోను" అంది తీర్మానంగా.

సందర్భం అర్థం కాక "యేమి సంగతి ?" అన్నాడు సీతారామయ్య.

"ఒకరింటికి యెందుకు పోవాలండీ ప్రతి సారీ — మనమేం బ్రతక లేక చస్తున్నామా ?" అన్నది ఆమె పౌరుషంగా.

విషయం అర్థం గాకపోయినా సీతారామయ్య జవాబు చెప్పినాడు. "బ్రతకలేక చస్తున్నామని యెవరన్నారూ ? మనమంతా చావలేక బ్రతుకు తున్నాం—అంతే.

"అబ్బ ! మీ మాటలు మీవేనండీ !" అంది శేషమ్మ విసుగ్గా.

"మరి నాకు అర్థమయ్యేటట్లు అచ్చ తెనుగులో చెప్పరాదూ ?" అన్నాడు సీతారామయ్య సరసంగా.

భర్త సరసాలకు శేషమ్మ నవ్వడం మానుకొని చాలా యేండ్లయింది. తన మామూలు ధోరణిలోనే ఆమె అన్నది : "యీసారి యిక్కడే పురుడు పోసుకుంటాను. యీ సంగతి చెప్దామనుకుంటే యెంత సాగదీస్తారండీ మీరూ !"

"దానికేం—లక్షణంగా కానీయ్. అంత శుభకార్యానికి నేను మాత్రం అడ్డు పడతానా ?"

పరిహాసం సీతారామయ్య తన బాధలమీద కప్పుకున్న ముసుగు. మొదటి కాన్పుకు భార్యను పుట్టింటికి పంపినప్పుడే పగటి కలలన్నీ ప్రక్కకు నెట్టి ఎలిమెంటరీ స్కూలు టీచర్ ఐనాడు. ముగ్గురు పిల్లలు పుట్టేటప్పటికి నిరాశ అతన్ని పూర్తిగా జయించింది. బాగా బ్రతకడానికి ప్రయత్నించడం తలకు మించిన పని అని ఆనాడే అనుకున్నాడు. అటు తర్వాత క్రమంగా బ్రతుకులోని భారాన్ని నవ్వులాటగా తీసుకోవడం నేర్చుకున్నాడు. ఆత్మహత్య చేసుకోలేని వాళ్ళలో చాలా మంది బ్రతుకు మీద కసిని భార్యా బిడ్డల మీద తీర్చుకుంటారు. కొంత మంది వేదాంతం పూసుకుంటారు. సీతారామయ్య వంటి వాళ్ళు తమ బాధలను పరిహాసం క్రింద దాచుకుంటారు. "యీ మూడు నాళ్ళ బ్రతుకులో వుత్త సుఖాలే కోరుకోవడం మానవుని దురహంకారం. కష్టాలు వస్తే యేం ? యెల్ల కాలం వుంటాయా ? చచ్చిందాకానే కదా !" అని అతని అంతరాత్మ చేసే వాదం. ఆ తర్వాత అతనికి జీవితంలో యెవరితోనూ పేచీలు రాలేదు. అప్పటి నుండి అతను భార్యను ఆజ్ఞాపించడం గానీ, దండించడంకానీ

లేదు. ఈ మార్పు శేషమ్మకు అర్థం గాకపోయినా, ఆమెకు తృప్తి కరంగానే వుంది.

ఆ రాత్రే భర్తకు అన్నం వడ్డిస్తూ ఆమె అడిగింది: "ఐతే మా అమ్మను రమ్మని జాబు వ్రాయండి."

"వ్రాస్తానుగానీ ఒక విషయం ఆలోచించినావా?" అన్నాడు సీతారామయ్య.

"యేమిటి?"

"నీకు కోపం వస్తుందేమో — ఐనా చెప్తాను. మీ అమ్మ వస్తే ఒక నెలైనా వుంటుంది గదూ?"

"ఉండదా మరి?" అన్నది శేషమ్మ ఉత్సాహంగా.

"మీ అమ్మకూడా అన్నం తింటుంది గదూ?"

శేషమ్మకు చురుక్కుమంది. మగని మాటలకు నవ్వడం మానుకున్నా, కోపగించుకునే శక్తి ఆమె యింకా కోల్పోలేదు. "యెవరమ్మైనా గడ్డి తింటుందా?" అన్నది తీవ్రంగా.

సీతారామయ్య చిరునవ్వుతో సమాధానం చెప్పినాడు. "అదే నే ననేదీ. యిప్పుడు ఒక పూటైనా అన్నం తింటున్నాము. యిక మీ అమ్మ వస్తే—గడ్డి తినకపోయినా—జొన్నలో రాగులో తినాలి రెండుపూట్లా."

శేషమ్మకు కండ్ల నీళ్ళ పర్యంతమైంది. భర్త చెప్పిందాంట్లో అబద్ధమేమీ లేదు. తన తల్లికి తాను నెల రోజులు అన్నం పెట్టే స్థితిలో లేదు. పదేండ్లకు పూర్వం అయితే, ఈ దుస్థితికి భర్తను నిందించి వుండేదే — మీకు సంపాదించే యోగ్యత లేకగదా అని. ఈ పదేండ్లలోనూ దేశంలో తన భర్త వంటి వాళ్ళు యెంతమంది వుండేదీ తెలుసుకుంది. తన

అశక్తతకు లోలోపల కుమలడం తప్ప యేమి చేయాల్నో ఆమెకు తెలియదు.

సీతారామయ్య అన్నం తిని పోయి మంచంమీద కూర్చున్నాడు. శేషమ్మ అన్నం ముందు కూర్చొని ముద్ద ముద్దకూ మనసులోని బాధను నెమరు వేసుకుంటూ వుంది. ఈ రెండేండ్లలోనూ సంసారం యెంత బరువైందీ జ్ఞాపకం చేసుకుంది. అన్ని వస్తువులూ క్రమక్రమంగా ధరలు పెరిగినాయి. సంవత్సరం నుండి ఒక పూట మాత్రమే బియ్యం వండుకుంటున్నారు. "పుట్టిన ఐదుగురిలో యిద్దరు పోయినా సంసారం యింత బరువుగా వుందే" అనుకుంది ఆమె. వెంటనే "ఛీ – పాడు ఆలోచన ! ఆయన వల్లనే యీ ఆలోచన నన్నూ పట్టుకొంది." అనుకొని తల విదలించుకొంది. ఒక నెలలోనే యిద్దరు పిల్లలు చచ్చి తాను మొత్తుకుంటుంటే "యెందు కేడుస్తావ్ – ఖర్చు తగ్గిందనా ?" అన్నాడు మగడు. ఇది జరిగి రెండేండ్లకు పైగా ఐనా "వాళ్లు బ్రతికి వుంటే యెంత కష్టంగా వుండేది ?" అన్న ఆలోచన ఆమెకు అప్పుడప్పుడూ వస్తూనే వుంది. ఈ ఆలోచన వచ్చినప్పుడల్లా "పిల్లలు చచ్చినందుకు సంతోషిస్తున్నావా ?" అని ఆమె అంతరాత్మ ఆక్రోశించేది. ఆమె ఉక్కిరి బిక్కిరై తన పిల్లలను తానే హత్యచేసినట్లు బాధపడేది.

ప్రొద్దుండగా పొరుగింటికి పోయిన యెనిమిదేండ్ల శారద వచ్చి "అమ్మా, సీతమ్మా వాళ్ళు తిరపతికి పోతున్నారే" అంది.

శేషమ్మ కండ్లు తుడుచుకొని బిడ్డవైపు చూసింది.

"వాళ్ళకు యినకంటాక్సు తప్పిపోయిందటమ్మా. అందుకని ముడుపు చెల్లించడానికి పోతున్నారే" అంది శారద.

శేషమ్మ పరధ్యానంగా "సరే లేవే" అంటూ చేయి కడుక్కొని లేచింది.

"యినకంటాక్సు అంటే ఏందమ్మా ?" అడిగింది శారద.

శేషమ్మ పలక్కుండా పోయి పసిపిల్లవాని ఉయ్యాల దగ్గర కూర్చుంది.

ఉట్టిపాటుగా ఆమెకు ఒక ఆలోచన వచ్చింది — బ్రహ్మాండమైన ఆలోచన. "తిరపతి వెంకటేశ్వరునికి ముందుగాముడుపు కట్టుకుంటే !" తన ఆలోచనకు తానే మురిసిపోతూ, "నా తెలివి తగలెయ్యా, యిన్నాళ్లూ యెందుకు తోచలేదో !" అనుకుంద ఆమె. వెంటనే భర్తవైపు తిరిగి "నాకు రెండు రూపాయలు యివ్వండి" అన్నది.

"ఈ నెలలో జీతం పెరిగిందనా ? ఐనా నీ భాగానికి రెండు రూపాయలు రాదే" అన్నాడు సీతారామయ్య.

"అదిగాదండీ — తిరపతి వెంకటేశ్వరునికి ముడుపు కట్టుకుంటాను" అన్నది శేషమ్మ.

"ఏం — మన ఐశ్వర్యం మీద ఆయనకూ కన్ను పడిందా !"

"మన కింక పిల్లలు వద్దని ముడుపు కట్టుకుంటాను." ఈమాటలకు భర్త సంతోషిస్తాడని ఆశగా అతని ముఖంలోకి చూసింది శేషమ్మ.

సీతారామయ్య నవ్వుతూ అన్నాడు : "పిచ్చిదానా! మన దేవుళ్ళకు యివ్వడమే తెలుసు. యివ్వకుండా వుండడం చేతగాదు."

"ఐతే మరి యేం చేయమంటారూ ?"

"మన పన్నుల మంత్రికి యింకా పది మంది పిల్లల్నివ్వమని ముడుపు కట్టుకో. లేకపోతే ఆ వెంకటేశ్వరున్నే వచ్చి ఒక నెల యీ సంసారం యీదమని కోరుకో."

శేషమ్మకు అర్థంకాక వెర్రి చూపులు చూస్తూ కూర్చుంది.

(జూన్ 1957)